# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 02-08-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రైతుల సాధికారతకు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు.**
2. **కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ గుంటూరులో ఈ సాయంత్రం 29 జాతీయ రహదారుల ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు.**
3. **ప్రతి నియోజకవర్గంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు.**
4. **మిగుల జలాలను వినియోగించుకునేందుకు పోలవరం - బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణం చేపడుతున్నట్లు మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.**
5. **ఆగష్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేస్తున్నామని రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు.**

==========================

రైతుల సాధికారతకు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు. ఉత్తరప్రదేశ్ లోని వారణాసి నియోజకవర్గంలో పీఎం కిసాన్ సమ్మాన్ నిధులను ఈరోజు విడుదల చేశారు. ఈ సందర్భంగా దేశ వ్యాప్తంగా 9.7 కోట్ల మంది రైతుల ఖాతాలలో 20 వేల కోట్ల రూపాయలను జమ చేశారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ప్రధానమంత్రి మాట్లాడుతూ..

వాయిస్.. 25 సెకన్లు

-------------------------

తిరుపతి జిల్లాలోని తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కుటుంబ సమేతంగా ఈరోజు ఉదయం దర్శించుకున్నారు. అనంతరం కేంద్రమంత్రికి ఆలయంలోని రంగనాయకుల మండపంలో తిరుమల తిరుపతి దేవస్థానం అదనపు కార్యనిర్వహణాధికారి వెంకయ్య చౌదరి తీర్థ ప్రసాదాలు అందచేసి పట్టు వస్త్రంతో సత్కరించారు.

మరో వైపు ఈ సాయంత్రం గుంటూరు జిల్లా మంగళగిరిలో జరిగే కార్యక్రమంలో 29 జాతీయ రహదారుల ప్రాజెక్టులకు కేంద్ర మంత్రి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

-------------------------

ప్రకాశం జిల్లా దర్శి మండలంలోని తూర్పు వీరాయపాలెంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈరోజు పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి రైతులతో ముఖా – ముఖి నిర్వహించారు. అనంతరం అన్నదాత – సుఖీభవ – పీఎం కిసాన్ పథకాన్ని ఆయన ప్రారంభించారు. ప్రతి నియోజకవర్గంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి తెలియజేస్తూ..

వాయిస్...29 సెకన్లు

---

స్వాతంత్ర్య సమరయోధుడు, భారత జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నివాళి అర్పించారు. ఆజన్మాంతం భరతమాత సేవలో తరించిన మహనీయుడు అని కొనియాడారు. జాతీయ పతాకం వినువీధిలో ఎగురుతున్నంత కాలం పింగళి వెంకయ్య మనకు గుర్తుంటారని తెలిపారు. ప్రతి భారతీయుడు ఎప్పటికీ గర్వించే త్రివర్ణ పతాకాన్ని అందించారని పేర్కొన్నారు.

---

సముద్రంలోకి వృధాగా పోతున్న వరద నీటి జలాలను వినియోగించుకునేందుకు పోలవరం – బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణం చేపడుతున్నట్లు జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో ఆయన నిన్న పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. పోలవరం– బనకచర్ల ప్రాజెక్టు వల్ల ఎగువ రాష్ట్రాలకు ఎలాంటి నష్టం లేదని చెప్పారు. 1975– 2024 సంవత్సరాల మధ్య 50 సంవత్సరాలలో లక్షా 53 వేల టీఎంసీల నీరు వృధాగా సముద్రంలోకి పోయిందని మంత్రి వివరిస్తూ..

– వాయిస్.. 31 సెకన్లు

---

పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ బృందం సింగపూర్ పర్యటన ముగించుకుని మలేషియా చేరుకుంది. కౌలాలంపూర్‌లో ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ – సిఆర్‌డిఏ కమిషనర్ కన్నబాబుతో కలిసి మంత్రి ఈరోజు పర్యటిస్తారు. అమరావతి నిర్మాణానికి సంబంధించి మలేషియా లో ఉన్న ఉత్తమ పద్ధతులను, వరద నివారణ చర్యలు, కన్వెన్షన్ సెంటర్లను పరిశీలిస్తారు. ఈ మధ్యాహ్నం మలేషియా పరిపాలన రాజధాని పుత్రజయలో ప్రభుత్వ పాలన భవనాల నిర్మాణాలు,మౌలిక వసతులు, టెక్నాలజీ పార్కులను అధ్యయనం చేస్తారు.

---

ఆగష్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేస్తున్నామని రవాణాశాఖ మంత్రి మండి పల్లి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు. తిరుపతిలో ఈరోజుపాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఎన్నికలలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని ప్రజలకు కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందని మంత్రి పేర్కొంటూ..

– వాయిస్.. 26 సెకన్లు

---

కృష్ణాజిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మచిలీపట్నంలో జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య

జయంతి కార్యక్రమం ఈరోజు నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావు, పోలీస్ సిబ్బంది, పలువురు నాయకులు పింగళి వెంకయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. స్వాతంత్ర ఉద్యమ సమయంలో గాంధీజీ పిలుపు మేరకు భారతదేశానికి మువ్వన్నెల జాతీయ పతాకాన్ని రూపొందించి దేశ ప్రజలలో స్వాతంత్ర కాంక్షను పెంచిన మహనీయులు పింగళి వెంకయ్య అని కొనియాడారు.

---------------------------

ఉపాధ్యాయ అర్హత పరీక్ష డీఎస్సీకి సంబంధించిన తుది కీ ని పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు డీఎస్సీ పరీక్షల కన్వీనర్ ఎమ్‌వి. కృష్ణారెడ్డి తెలిపారు. ప్రాథమిక కీ విడుదల తర్వాత అభ్యర్థుల నుంచి వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి తుది కీ రూపొందించినట్లు ఆయన వివరించారు. దీనిపై ఎలాంటి అభ్యంతరాలు స్వీకరించడం లేదని స్పష్టం చేశారు.

---------------------------

భారత్, ఇంగ్లాండ్ మధ్య అయిదో క్రికెట్ టెస్టు మ్యాచ్ ఓవల్‌లో కొనసాగుతోంది. నిన్న జరిగిన రెండో రోజు ఆటలో భారత్‌ను తొలి ఇన్నింగ్స్‌లో 224 పరుగులకు ఇంగ్లాండ్ ఆలౌట్ చేసింది. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన ఇంగ్లాండ్ 247 పరుగులకు ఆలౌటైంది. ప్రస్తుతం భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 2 వికెట్ల నష్టానికి 75 పరుగులు చేసింది. యశస్వి జైస్వాల్ 51, ఆకాశ్‌దీప్ 4 పరుగులు వద్ద బ్యాటింగ్ చేస్తున్నారు.

---------------------------

బళ్లారి రాఘవ జీవితం యువతకు ఆదర్శనీయమని అనంతపురం జిల్లా ఇన్ ఛార్జ్ కలెక్టర్ శివ నారాయణ్ శర్మ అన్నారు. బళ్లారి రాఘవ జయంతిని పురస్కరించుకొని అనంతపురం కలెక్టర్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఈరోజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇన్ ఛార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ.. బళ్లారి రాఘవ అనంతపురం జిల్లా తాడిపత్రిలో జన్మించారని తెలిపారు. ఆయన తెలుగు నాటక రంగ ప్రముఖులని, అప్పట్లో ప్రముఖ న్యాయవాది అయిన కూడా నాటకాలలో ప్రత్యేకాభిమానం, ప్రతిభతో రాణించారని కొనియాడారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాం దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి, పశ్చిమ దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి జి. లక్ష్మీ తెలియజేస్తూ....

వాయిస్…18 సెకన్లు

=====================